

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు సమస్యలు వివరిస్తున్న స్థానికులు

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించొద్దు

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించొద్దని, మీ పనితీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హెచ్చరించారు. సోమవారం బాలాజీనగర్ డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావుతో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. కేపీహెచ్‌బీ ధనలక్ష్మీ సెంటర్ నేతాజీ పార్కును పరిశీలించిన ఎమ్మెల్యే అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్కుల్లో అభివృద్ధి దేవుడెరుగు.. కనీసం చెత్తనూ ఎందుకు తొలగించడం లేదని మండలించారు. పార్కులో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఎమ్మెల్యేకు వివరించారు. ఎక్కడి పనులు అక్కడ పెండింగ్‌లో ఉండటం, అధ్వానంగా ఉన్న వాకింగ్‌ట్రాక్, స్ట్రీట్ లైట్స్ వెలగకపోవడం, తరచూ చెత్తను తరలించకపోవడం చూసిన ఎమ్మెల్యే అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇంజనీరింగ్ పనులను కొన్ని నెలల క్రితమే ఆపేశారని చెప్పడంతో 15 రోజులు సమయం ఇస్తున్నా.. ఆలోగా పార్కులో పెండింగ్ పనులను పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు లేదంటే మీపై ఎలాంటి చర్యలు తీసుకుంటానో మీరే చూస్తారని హెచ్చరించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ సతీష్ అరోరా, డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్ తదితరులు ఉన్నారు.



ప్రజావాణిలో జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్, ఇతర అధికారులు

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

జోనల్ కమిషనర్ సమక్షంలో ఫిర్యాదుదారుల ఆగ్రహం

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు చర్యలు తీసుకుంటున్న దాఖలాలు ఎక్కడా కన్పించడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. కూకట్‌పల్లి జోన్ పరిధిలో అక్రమ నిర్మాణాలను ఆపేదెవరు అని వారు ప్రశ్నించారు. జడ్సీ సమక్షంలోనే ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, ఫిర్యాదులు చేయాలా ? వద్దా అని సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రశ్నించారు. జోన్ పరిధిలో మొత్తం 28 ఫిర్యాదులు రాగా.. అందులో 22 టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించినవే ఉండటం గమనార్హం. ఐదు ఇంజనీరింగ్, ఒకటి పార్కు గురించి ఫిర్యాదు చేశారు. సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయా సర్కిళ్ల డీసీల పరిధిలోని అధికారులు చూడాలని జడ్సీ ఆదేశించినా సంబంధిత టౌన్‌ప్లానింగ్ అధికారులు సీరియస్‌గా తీసుకోవడం లేదని పలువురు ఫిర్యాదులు అన్నారు.

ఒకటే విషయమై నెలకు రెండు, మూడు సార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదని కేపీహెచ్‌బీకి చెందిన పలువురు ఫిర్యాదుదారులు ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని జడ్సీ సమక్షంలో రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకోవడంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు అలసత్వం వహిస్తున్నారని కేపీహెచ్‌బీ భగత్‌సింగ్‌నగర్ ఫేజ్-1 అసోసియేషన్ సభ్యులు వాపోయారు.



కూకట్‌పల్లి జడ్సీ అపూర్వచౌహాన్‌కు వినతిపత్రం అందజేసి సమస్యలు వివరిస్తున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహ్మాయాదవ్

పెండింగ్ పనులకు నిధులు మంజూరు చేయాలి

ఓల్డుబోయినపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఓల్డుబోయినపల్లి డివిజన్‌లో పెండింగ్ పనులకు నిధులు మంజూరుచేసి వెంటనే ప్రారంభించాలని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ కోరారు. కూకట్‌పల్లి సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో కమిషనర్ అపూర్వ చౌహాన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. బోయినపల్లి చెరువు సుందరీకరణలో భాగంగా రిటర్నింగ్ వాల్, సీసీ రోడ్లు, హైమాస్ట్ లైట్లు, ప్రియదర్శిని హోటల్ నుంచి దుబాయ్ గేటు వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని వినతిప్రతంలో పేర్కొన్నారు. డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న పనులన్నింటికీ నిధులు మంజూరు చేసి వెంటనే ప్రారంభించాలని కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు.



గాంధీ విగ్రహానికి పూలమాలలువేసి క్షమించాలని వేడుకుంటున్న ఆకతాయిలు

మహాత్మాగాంధీ అంటే గౌరవమే

● తప్పయింది క్షమించండి ● క్షమాపణ కోరిన ఆకతాయిలు

బోయిన్‌పల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): 'మహాత్మాగాంధీ అంటే తమకు గౌరవం ఉంది. తెలియక చేశాం.. తప్పయింది క్షమించండి' అని బాపూజీనగర్‌లోని గాంధీ విగ్రహం నోట్లో బాంబుపెట్టి పేల్చిన ఆకతాయిలు సోమవారం అదే విగ్రహం వద్ద వారి తల్లితండ్రులు, స్థానికుల సమక్షంలో క్షమాపణ కోరారు. ఈ విషయంపై బోయిన్‌పల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోయిన్‌పల్లి బాపూజీనగర్‌లో నివాసం ఉండే ఓ యువకుడు (17)తో పాటు అతని స్నేహితులు మరో ముగ్గురు (16ఏళ్లు) శనివారం తమ బంధువులకు సంబంధించిన పెద్దకర్మ కార్యక్రమంలో మద్యం తాగి బస్తీలోని గాంధీ విగ్రహం వద్దకు చేరారు. ఈ క్రమంలో దీపావళి పండుగ కూడా కావడంతో వారు టపాలను తీసుకువచ్చి మహాత్మాగాంధీ విగ్రహం నోట్లో పెట్టి కాల్చి వీరంగం సృష్టించారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ వీడియోను స్నాప్ చాట్‌లో చూసిన స్థానికులు విషయాన్ని పోలీసులకు తెలిపారు. విచారణ చేపట్టిన బోయిన్‌పల్లి పోలీసులు నలుగురు ఆకతాయిలను అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో తల్లితండ్రుల విజ్ఞప్తి మేరకు సోమవారం అదే విగ్రహం వద్ద ఆకతాయిలు మహాత్మాగాంధీజీ విగ్రహాన్ని పాలతో శుద్ధిచేశారు. అనంతరం పూలమాలలువేసి నివాళులర్పించి చెంపలు వేసుకుని పోలీసులను, స్థానికులను తల్లితండ్రుల సమక్షంలో క్షమించాలని ప్రాదేయపడ్డారు. దీంతో ఈ ఘటనపై పోలీసులు ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం వారిని కోర్టులో హాజరుపరచనున్నారు.

మినరల్ కాదు .. జనరల్ వాటరే

యథేచ్ఛగా తాగునీటి దందా

● అనుమతి లేకుండా వాటర్ ప్లాంట్లు
● నాణ్యత, శుభ్రత పట్టించుకోని వ్యాపారులు
● చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్న అధికారులు

అల్లాపూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మినరల్ వాటర్ పేరుతో తాగునీటి విక్రయాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. కొందరు అనుమతులు లేకుండానే శుద్ధనీటిని విక్రయిస్తున్నారని, ఇంకొందరు నీటి నాణ్యత, శుభ్రతను పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. అధికారులు కూడా ఇలాంటి నీటి శుద్ధి కేంద్రాలను చూసీచూడనట్టు వ్యవరిస్తుండటంతో నాణ్యత లేని నీటి బబుల్స్ (20 లీటర్ల పారదర్శక క్యాన్) విక్రయిస్తున్నారు. మినరల్ వాటర్ కాదు... అది జనరల్ వాటరే అని, ఆ నీరు తాగిన ప్రజలు అనారోగ్యాల బారినపడే అవకాశముంది.

నాణ్యతా ప్రమాణాలు గాలికి

అల్లాపూర్, బోరబండ, మాదాపూర్, మోతీనగర్‌లలో కొన్నేళ్లుగా నీటి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ప్రత్యేకించి అల్లాపూర్ డివిజన్ పరిసరాల్లో సున్నం చెరువు, మైసమ్మ చెరువు, కాముని చెరువుల ఉన్నాయి. సున్నం చెరువు, కాముని చెరువు సమీపంలో కొందరు బోర్లు వేసి నీటిని తోడేస్తున్నారు. అక్కడ మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. ఆయా వాటర్ ప్లాంట్లలో బోరు వాటర్‌ను శుద్ధిచేసి మినరల్ వాటర్ పేరుతో సమీపంలోని బస్తీలు, కాలనీలు, హైటెక్ సిటీలోని కంపెనీలకు సరఫరా చేస్తున్నారు. శుద్ధనీటి తయారీదార్ల సంస్థ పేరు, ఐఎస్ఐ గుర్తింపు నెంబరు లాంటివి ముద్రించకుండానే వాటిని సరఫరా చేస్తున్నారు. ప్రతి ప్లాంట్‌లోనే ల్యాబ్‌ను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు నీటి నమూనాలను పరీక్షించాల్సి ఉంటుంది. ఇవేమీ పట్టించకపోగా కనీసం బబుల్స్‌కు సీళ్లు కూడా సరిగ్గా వేయకుండా వాటిని విక్రయిస్తూ అక్రమ ధనార్జనకు పాల్పడుతున్నారనే విమర్శలున్నాయి.

అపరిశుభ్రం

నీటి సరఫరాకు వినియోగించే బబుళ్లను(క్యాన్లను) కడగటం లేదని, కొన్ని సందర్భాల్లో పాచిపట్టి అపరిశుభ్రంగా ఉంటున్నాయి. దాంతో వినియోగదార్లు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు తనిఖీలు చేయకపోవడం వల్లే కొందరు వ్యాపారులు నీటిలో నాణ్యత, శుభ్రత పాటించడంలేదని ఆరోపిస్తున్నారు.

కలుషిత నీటి సరఫరా వల్ల...

జలమండలి సరఫరా చేస్తున్న నీటిని అధిక శాతం ప్రజలు నేరుగా తాగడం లేదు, ఇందుకు కొన్ని సందర్భాలలో భూగర్భ పైపులైన్ల లీకేజీలు, డ్రైనేజీ నీటితో కలిసి కలుషితమవడం ప్రధాన కారణం. ఈ విషయమై జలమండలి అధికారులను సంప్రదిస్తే, ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తేవాలని, పరిశీలించి వెంటనే చర్యలు చేపడతామని పేర్కొన్నారు.



ఓ షాపులో డిస్పెన్సర్‌కు బిగించిన 'మినరల్' వాటర్ బబుల్



ఆటో ట్రాలీలు, వ్యాన్ల ద్వారా సరఫరా

ఆటోట్రాలీలు, వ్యాన్ల ద్వారా నిత్యం గృహాలు, వ్యాపార కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, కూల్‌డ్రింక్ దుకాణాలకు 20 లీటర్ల క్యాన్లలో నీటిని సరఫరా చేస్తున్నారు. దుకాణాలకు 20 లీటర్ల క్యాను రూ.10 నుంచి రూ. 20 వరకు విక్రయిస్తున్నారు. గృహాలలోని ప్రజలకు రూ.20 నుంచి రూ.25 దాకా విక్రయిస్తున్నారు.

వర్సిటీల అభివృద్ధిలో జేఎన్‌టీయూ మార్కు ప్రతిబింబించేలా కృషి

హైదరాబాద్ సిటీ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆర్‌జేయూకేటీ, పాలమూరు యూనివర్సిటీల అభివృద్ధిలో జేఎన్‌టీయూ మార్కు ప్రతిబింబించేలా కృషిచేస్తామని ఆయా యూనివర్సిటీలకు నూతనంగా నియమితులైన వైస్‌చాన్స్‌లర్లు(వీసీ) స్పష్టం చేశారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన దశాబ్దం తర్వాత రాష్ట్రంలోని రెండు యూనివర్సిటీలకు ప్రభుత్వం నూతనంగా వీసీలను నియమించింది. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన వీసీలు ప్రొఫెసర్ గోవర్ధన్, ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్‌లను జేఎన్‌టీయూ బోధన, బోధనేతర సిబ్బంది ఘనంగా సత్కరించారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ఈ సన్మాన కార్యక్రమంలో ఆర్‌జేయూకేటీ వీసీ గోవర్ధన్ మాట్లాడుతూ.. జేఎన్టీయూ కంప్యూటర్ ఇంజినీరింగ్ విభాగాధిపతిగా, కళాశాల ప్రిన్సిపాల్‌గా, యూనివర్సిటీకి రెక్టార్‌గా పనిచేసిన అనుభవాన్ని బాసర ట్రిపుల్‌ఐటీ(ఆర్‌జేయూకేటీ) అభివృద్ధికి వినియోగిస్తానన్నారు. పాలమూరు యూనివర్సిటీ వీసీ జీఎన్ శ్రీనివాస్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతిగా, సుల్తాన్‌పూర్, జేఎన్‌టీయూ కాలేజీలకు ప్రిన్సిపాల్‌గా చేసిన అనుభవం తనకుందన్నారు. అది పాలమూరు యూనివర్సిటీని ప్రగతిపథంలో నడిపేందుకు దోహదపడుందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న జేఎన్‌టీయూ రెక్టార్ విజయకుమార్ రెడ్డి మాట్లాడుతూ.. విభిన్న రంగాల్లో విశేషమైన అనుభవం గడించిన జేఎన్‌టీయూ ప్రొఫెసర్లు ప్రభుత్వం వారికి కొత్తగా అప్పగించిన వీసీ బాధ్యతల్లో కూడా రాణించాలని ఆకాంక్షించారు. రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ..జేఎన్టీయూ నుంచి ఇద్దరు ప్రొఫెసర్లు వైస్‌చాన్సలర్లుగా ఎంపిక కావడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జీ.వి.నర్సింహారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ పద్మావతి, పలువురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్‌జేయూకేటీ, పాలమూరు యూనివర్సిటీల వీసీలు గోవర్ధన్, శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న జేఎన్‌టీయూ రెక్టార్, రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్ తదితరులు

శివాలయాలకు పోటెత్తిన భక్తులు

బాలానగర్/కేపీహెచ్‌బీ కాలనీ/ఓల్డ్ బోయినపల్లి/ఫతేనగర్ , నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మొదటి సోమవారంను పురస్కరించుకుని ఓల్డుబోయినపల్లి, ఫతేనగర్, బాలానగర్ డివిజన్ పరిధిలో ఉన్న శివలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారు జామునుంచే భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయాలకు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకునేందుకు క్యూలో నిల్చున్నారు. బాలానగర్ ఫిరోజ్‌గూడ, బాలానగర్ ప్రధాన రహదారి, ఫతేనగర్ శివాలయం రోడ్డులో ఉన్న ఉన్న పురాతన శివాలయంలో భక్తుల సందడి ఎక్కువగా కనిపించింది. భరత్‌నగర్ హరిహరా క్షేత్రం, సిద్దిలింగేశ్వరా ఆలయంలో భక్తులు బారులు తీరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మూసాపేట్‌లోని శ్రీసిద్ధి రామలింగేశ్వరస్వామి ఆలయంలో కుటుంబ సభ్యులతో కలిసి మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ పూజలు చేశారు. ఓల్డుబోయినపల్లి డివిజన్ ఆర్‌ఆర్‌నగర్ శివాలయంలో కార్పొరేటర్ ముద్దం నర్సింహ్మాయాదవ్ కుటుంబ సభ్యులతో కలిసి శివలింగానికి అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో ముద్దం మహేష్‌యాదవ్, మన్నెవెంకట్ యాదవ్, చందూయాదవ్, బుర్రి యాదగిరి పాల్గొన్నారు. ఫతేనగర్ శివాలయం రోడ్డులోని భ్రమరాంభిక సహితమల్లికార్జున స్వామి ఆలయంలో ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్, సురేందర్‌నాయుడు కుటుంబ సభ్యులతో కలిసి పూజలు చేశారు.



బాలానగర్ ప్రధాన రహదారి పక్కన పురాతన శివాలయంలో శివలింగానికి అభిషేకాలు చేస్తున్న భక్తులు



మూసాపేట సిద్దిలింగేశ్వరస్వామి ఆలయంలో కుటుంబ సభ్యులతో కలిసి పూజలు నిర్వహిస్తున్న మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్



ఓల్డుబోయినపల్లి శివాలయంలో కుటుంబ సభ్యులతో కలిసి శివలింగానికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేస్తున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహ్మాయాదవ్



ఫతేనగర్‌లోని భ్రమరాంభిక సహితమల్లికార్జున స్వామి ఆలయంలో కుటుంబ సభ్యులతో కలిసి శివపూజలు చేస్తున్న కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ తదితరులు



నిరసన వ్యక్తం చేస్తున్న జేఏసీ నేతలు, ఉద్యోగులు

అంబేడ్కర్ వర్సిటీలో కొనసాగుతున్న నిరసనలు

హైదరాబాద్ సిటీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే మూడో మెగా యూనివర్సిటీ డా.బి.ఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ అని అంబేడ్కర్ జేఏసీ చైర్‌పర్సన్ ప్రొ.పల్లవీకాబ్డే, కన్వీనర్ ప్రొ.వడ్డాణం శ్రీనివాస్ అన్నారు. అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ పది ఎకరాల స్థలాన్ని జవహర్‌లాల్‌నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి(జేఎన్ఏఎఫ్ఏయూ) కేటాయించొద్దని సోమవారం ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం తన ఆలోచనను వెంటనే ఉపసంహరించుకోవాలని.. లేదంటే తమ ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కంప్యూటర్ ఇంజనీర్ వసంతరావు మాట్లాడుతూ.. అంబేడ్కర్ వర్సిటీలో డిగ్రీ నుంచి పరిశోధన కోర్సుల వరకు విద్యను అందిస్తున్నామన్నారు. దేశంలో స్థూల నమోదు నిష్పత్తిని పెంచడానికి అంబేడ్కర్ వర్సిటీ దూరవిద్యా విధానాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. జేఏసీ నేతలు, అధ్యాపక, అధ్యాపకేతర, అడ్మినిస్ట్రేటివ్, టెక్నికల్ అసోసియేషన్, టైంస్కేల్, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నేతలు ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

మందుబాబులకు అడ్డాగా కమ్యూనిటీహాలు



అసంపూర్తిగా కమ్యూనిటీహాల్ భవనం

ఫతేనగర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఫతేనగర్ అక్షయ్ ఎన్‌క్లేవ్‌లో రూ.30 లక్షలతో చేపట్టిన కమ్యూనిటీహాలు పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. 2022, డిసెంబర్ 24న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావ కమ్యూనిటీహాలు పనులకు శంకుస్థాపన చేశారు. మొదట పనులు సాఫీగానే సాగడంతో రెండు నెలల్లో పూర్తవుతుందనుకున్న కమ్యూనిటీహాలు ఇంకా నిర్మాణ దశలోనే ఉంది. అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాల్‌లో మందుబాబులు తిష్టవేస్తున్నారు. ఈ విషయంపై సర్కిల్ అధికారిని అడిగితే నెల రోజుల్లో అయిపోతుందని దాటవేస్తున్నారని స్థానికులు అంటున్నారు. ఏడాదిన్నర దాటిన పనులు ముందుకు సాగడం లేదని, దాంతో మందుబాబులకు అడ్డాగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిధులు కేటాయించి వెంటనే కమ్యూనిటీహాలు నిర్మాణ పనులను పూర్తి చేయాలని అక్షయ్ ఎన్‌క్లేవ్ వాసులు కోరుతున్నారు.

'శ్రీకాంత్ పటేల్‌ను ఆదర్శంగా తీసుకోవాలి'

బాలానగర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాంత్ పటేల్‌ను అతడి స్నేహితులు ఆదర్శంగా తీసుకోవాలని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం సూచించారు. బాలానగర్‌కు చెందిన రాజేశ్‌గౌడ్ బతుకుదెరువు కోసం సౌదీ అరేబియాకు అక్కడ ఇటీవల అకాల మరణం పొందారు. రాజేశ్‌గౌడ్ జ్ఞాపకార్థంగా ఆయన ప్రాణ స్నేహితుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పులి శ్రీకాంత్ పటేల్ గౌడ్ సొంత నిధులతో రెండు శవపేటికల(ఫ్రీజర్)ను తయారు చేయించగా, సోమవారం సత్యం శ్రీరంగం వాటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ పటేల్‌గౌడ్ మాట్లాడుతూ రాజేశ్‌పటేల్ గౌడ్ బతికున్న సమయంలో పేదలకు ఏదో ఒకటి చేయాలని తపించేవాడన్నారు. అతడి కోరిక మేరకు ప్రజలకు ఉపయోగడాలని రెండు శవపేటికలు తయారు చేయించినట్లు చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సూరజ్‌తివారీ, రాజూ ముదిరాజ్ స్థానిక నాయకులు, రాజేశ్‌గౌడ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అంధ క్రీడాకారులకు సహాయం అందిస్తాం

● డీజీపీ డాక్టర్ జితేందర్

హైదరాబాద్ సిటీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పోలీసు విభాగం తరపున అంధ క్రీడాకారులకు ఎల్లప్పుడూ సహాయం అందిస్తామని డీజీపీ డాక్టర్ జితేందర్ అన్నారు. తెలంగాణ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఆఫ్ బ్లైండ్, తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో "ఇన్‌క్రెడిబుల్ ఇండియా తెలంగాణ బ్లైండ్ చాలెంజ్ కప్ 2024 టోర్నమెంట్"ను అంబర్‌పేట వాటర్‌వర్క్స్ స్టేడియంలో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అంధుల క్రికెట్‌ను ప్రోత్సహించేందుకు ప్రత్యేక స్టోర్ ఏర్పాటు ఆవశ్యకతను తెలిపారు. ఈ టోర్నమెంట్ ద్వారా అంధుల క్రీడా ప్రతిభకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని, సమాజంలో అవగాహన పెరుగుతుందని భావిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ (టీడీసీఏ) ఫౌండర్ ప్రెసిడెంట్, స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ అల్లీపురం వేంకటేశ్వర్‌రెడ్డి, ఇన్‌క్రెడిబుల్ ఇండియా ప్రాజెక్ట్ సీఓఓ, ఎండీ ప్రవీణ్‌కుమార్ నెడుంగడి, డైరెక్టర్ సరిడేన రాహుల్‌రావు, అంధత్వశాఖ డైరెక్టర్, కమిషనర్ బి. శైలజ, డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఆఫ్ బ్లైండ్(డీఏబీ) తెలంగాణ ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, క్రికెట్ క్రీడాకారులు సురేందర్‌రెడ్డి, హెలెన్ కెల్లర్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ రీహాబిలిటేషన్ డిసేబుల్డ్ చిల్డ్రన్ చైర్మన్ ఉమర్ ఖాన్, ఖమ్మం టీడీఎస్ఏ సభ్యులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో

కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయాల ధరలు కేజీల్లో ఇలా ఉన్నాయి. టమోట రూ.31, వంకాయ రూ.50, బెండకాయ రూ.45, పచ్చిమిర్చి రూ.35, బజ్జి మిర్చి రూ.80, కాకరకాయ రూ.38, బీరకాయ రూ.35, క్యాబేజీ రూ.33, బీన్స్ రూ.75, క్యారెట్ రూ.80, గోబీపువ్వు రూ.23, దొండకాయ రూ.28, చిక్కుడుకాయ రూ.95, గోరు చిక్కుడు రూ.55, బీట్‌రూట్ రూ.50, క్యాప్సికం రూ.80, ఆలుగడ్డ రూ.38, కీర రూ.17, దోసకాయ రూ.35, పొట్లకాయ రూ.23, కంద రూ.65, ఉల్లిపొరక రూ.55, ఉల్లిగడ్డ రూ.40, చామగడ్డ రూ.40, పుట్టగొడుగులు రూ.40, ఎండు మిర్చి రూ.220, అల్లం రూ.160, వెల్లుల్లి రూ.380, చింతపండు రూ.140, పండు మిర్చి రూ.80, ఉసిరి రూ.80, మామిడికాయ రూ.15-20 (ఒక్కటి), సొరకాయ రూ.15 (ఒక్కటి), అరటికాయ రూ.8-9 (ఒక్కటి), ముల్లంగి రూ.4-5, చిలగడదుంప రూ.28, గుమ్మడికాయ రూ.18, నిమ్మకాయలు రూ.50-60, మునగ కాయలు రూ.8-10, బొప్పాయి రూ.40, కరివేపాకు రూ.70, పర్వల్ రూ.45, పల్లికాయ రూ.65, లోబా రూ.45, ఆ కాకరకాయ రూ.120. పైన పేర్కొన్న ధరలు ఈరోజు ఉదయం 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.





మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల

పట్టాలు సిద్ధం చేయండి: కలెక్టర్

హైదరాబాద్ సిటీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లతోపాటు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ దరఖాస్తులను, రెవె న్యూ అంశాల పరిష్కారానికి వేగవంతంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో హైదరాబాద్, సికింద్రాబాద్ రెవెన్యూ డివిజన్లకు చెందిన ఆర్డీఓలు, తహసీల్దార్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెండు పడకల ఇళ్లు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సికింద్రాబాద్ పరిధిలోని జమునానగర్, తార్నాకలో అర్హులైన పేదలకు ఇళ్లు అందించే దిశగా పట్టాలను సిద్ధం చేసి అందుబాటులో ఉంచాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ముకుందరెడ్డి, డీఆర్‌ఓ వెంకటాచారి, ఆర్డీఓలు రామకృష్ణ, సాయిరామ్, తహసీల్దార్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మూసాపేట సర్కిల్ డీసీగా వంశీకృష్ణ



కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి జోన్ పరిధిలో మూసాపేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్(డీసీ)గా గ్రేడ్ -1 ఆఫీసర్ బి.వంశీ కృష్ణ నియమితులయ్యారు. ఈయన గతంలో ఖైరతాబాద్ డిప్యూటీ డిప్యూటీ కమిషనర్‌గా, నిజాంపేట మున్సిపల్ కమిషనర్‌గా, చందానగర్ డీసీగా పనిచేస్తూ గ్రూప్‌వన్ పరీక్షలకోసం లాంగ్ లీవ్‌పెట్టారు. గత నెల 30న మూసాపేట డీసీ రమేష్ పదవి విరమణ చేయడంతో ఒక్కడ పోస్టు కోసం పలువురు పోటీపడ్డారు.

రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలకు

ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు



సందీప్, వివేక్

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలకు కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ వెంకటయ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గచ్చిబౌలిలో నిర్వహించిన స్కూల్ గేమ్ ఫెడరేషన్ అండర్ 19 ఆధ్వర్యంలో జరిగిన రైఫిల్ పోటీల్లో జిల్లాస్థాయిలో పి.సందీప్ మొదటి స్థానం, ఆర్.వివేక్ రెండో స్థానంలో నిలిచారన్నారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ షర్మిల ఆధ్వర్యంలో విద్యార్థులు శిక్షణ పొంది స్పోర్ట్స్, గేమ్స్ విభాగాల నుంచి మంచి పేరు తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు.

వాటర్‌వర్క్స్ యూనియన్‌తో

పల్లా రాజేశ్వర్‌రెడ్డికి సంబంధం లేదు

● యూనియన్ అధ్యక్షుడు రాజిరెడ్డి

హైదరాబాద్ సిటీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వాటర్‌వర్క్స్ ఎంప్లాయీస్ యూనియన్‌తో గౌరవ అధ్యక్షుడిగా కొనసాగిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత రాంబాబుయాదవ్‌లకు సంబంధం లేదని యూనియన్ అధ్యక్షుడు రాజిరెడ్డి, ఉపాధ్యక్షుడు మహ్మద్ జహంగీర్ ప్రకటించారు. సోమవారం ఖైరతాబాద్‌లోని వాటర్‌బోర్డు ప్రధాన కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. యూనియన్ జనరల్ బాడీ సమావేశంలో అధ్యక్ష పదవి నుంచి రాజేశ్వర్‌రెడ్డిని తొలగించామన్నారు. గతంలో ఎన్నికల్లో గెలుపొందిన నేతలు కార్మికుల, ఉద్యోగుల సమస్యలను యాజమాన్యంతో చర్చించి పరిష్కరించడంలో విఫలమయ్యారని, యూనియన్ సభ్యుల ఆమోదం మేరకు వారిని తొలగించామని తెలిపారు. వాటర్‌వర్క్స్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యవర్గ అధ్యక్షుడిగా రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వెల్లడించారు. సమావేశంలో కె.రామచంద్ర, సాయికిరణ్‌గౌడ్, హషీం, అజయ్‌నాథ్, పండు, నరసింహారెడ్డి, మొగులయ్య శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



టీటీడీ చైర్మన్‌కు సత్కారం

టీటీడీ చైర్మన్‌గా నియమితులైన బీఆర్ నాయుడుని కేపీహెచ్‌బీ రమ్యగ్రౌండ్ మిత్రబృందం, టీడీపీ, కాంగ్రెస్ నాయకులు ఆయన కార్యాలయంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. బీఆర్ నాయుడుకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో కట్టా నరసింగరావు, షేక్ సత్తార్, కె.నారాయణరాజు, కె.శ్రీనివాస్, ఎస్. మధు, ఎం. సాంబశివరావు, దొడ్డి రంగస్వామి, అళ్ల నాగార్జున, కోటి తదితరులున్నారు.

– కేపీ హెచ్‌బీకాలనీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి)

ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు

● ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్



మియాపూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రోజురోజుకు పెరుగుతున్న వాహనాల సంఖ్యకు అనుగుణంగా రోడ్ల విస్తర్ణ జరగలేదు. ఉన్న రహదారుల్లో ట్రాఫిక్‌ను క్లీయర్ చేయడానికి రోడ్లపై ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించడంతో పాటు ఫ్రీలెఫ్ట్‌లు ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించడంతో ట్రాఫిక్ సమస్య కొంతమేర తగ్గిస్తున్నామని మియాపూర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారులపై వారిపై రోజుకు 200 మందిపై కేసులు నమోదు చేస్తున్నాం. ప్రతి నెల ఆరువేలకు పైగా కేసులు నిబంధనలు పాటించని వారిపై నమోదవుతున్నాయని సీఐ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన ట్రాఫిక్ నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై సోమవారం ఆంధ్రజ్యోతి నిర్వహించిన ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలు వెల్లడించారు.

ట్రాఫిక్ నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

మియాపూర్‌లో ఏప ప్రాంతాల్లో రద్దీ ఎక్కువగా ఉందో గుర్తించి ప్రణాళిక బద్ధంగా నియంత్రించేందుకు అనేక ప్రాంతాల్లో యూటర్న్‌ల వద్ద ట్రాఫిక్ సిబ్బందిని నియమించి ట్రాఫిక్ సమస్యకు కారణాలు గుర్తించి డివైడర్లు ఏర్పాటు చేయడంతో పాటు ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌లను తొలగించి వాహనాలు సాఫీగా సాగేలా చర్యలు తీసుకుంటున్నాం.

పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు ఎలా నివారిస్తున్నారు?

ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న డెంజర్స్ స్పాట్‌లను గుర్తించి వాటి నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. మియాపూర్ మెట్రో 600 పిల్లర్, మదీనగూడ మైత్రికమాన్, హఫీజ్‌పేట ఫ్లైఓవర్, జీఎస్‌ఎం మాల్, మదీనగూడ దీప్తిశ్రీనగర్ ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, అదేవిధంగా రోడ్డు డివైడర్ మధ్యలో అడ్డుగా వెల్డింగ్ పెన్సింగ్ లేకపోవడంతో ఆల్విన్‌చౌరస్తా అతిథి హోటల్ వద్ద నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు దాటడం గుర్తించి అక్కడ వెల్డింగ్ నిర్మాణానికి పై అధికారులకు నివేదిక అందజేశాం.

ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేస్తున్నాం. ప్రధానంగా ట్రిపుల్ రైడింగ్, వ్యతిరేక దిశలో డ్రైవింగ్, యూటర్న్ వద్ద కాకుండా డివైడర్ వద్ద నిబంధలనకు విరుద్ధంగా రోడ్డు క్రాస్ అవడం, డ్రైవింగ్ లైసెన్స్‌లేకుండా వాహనాలు నడపడం, మైనర్లు వాహనాలు నడపడం వంటి వాటిపై, రిజిస్ట్రేషన్ నంబర్లు లేకుండా వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు చేస్తున్నాం.

ఇంటింటి సర్వేకు సర్వం సిద్ధం

● ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు



శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో సిబ్బందికి శిక్షణ ఇస్తున్న అధికారులు

గచ్చిబౌలి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ వెస్‌జోన్ పరిధిలో ఇంటింటి సర్వేకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ముఖ్యంగా శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని శేరిలింగంపల్లి, చందానగర్, యూసుఫ్‌గూడ, పటాన్‌చెరు సర్కిళ్ల పరిధిలో సర్వేకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డితో పాటు ఆయా సర్కిళ్లకు చెందిన ఉప కమిషనర్లు ఇంటింటి సర్వేను విజయవంతంగా పూర్తిచేయాలని గత వారం రోజులుగా ప్రణాళికలు సిద్ధం చేశారు. అందుకు అనుగుణంగా పనులు కూడా ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నెల 6 నుంచి ఇంటింటి సర్వే ప్రారంభం కానుంది. ఈ క్రమంలో ఎన్యూమరేటర్లు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తారు. సూపర్‌వైజర్లు తప్పని సరిగా ప్రభుత్వ అధికారులు ఉండేలా చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు, జీహెచ్‌ఎంసీ, తహసీల్దార్, ఎంఈవో, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్ల తదితరులందరిని ఎన్యూమరేటర్లుగా నియమిండం జరిగింది. ఈ మేరకు వీరికి శిక్షణ కూడా ఇవ్వడం జరిగింది. ఇప్పటికే కొన్ని సర్కిళ్లలో కావాల్సిన మెటీరియల్స్, పెన్నులు, ఇతర సామాగ్రి సిబ్బందికి అందజేశారు. అధికారికంగా కూడా ఇంకా కావాల్సిన వస్తువులు ఇవ్వనున్నట్లు జడ్సీ ఉపేందర్‌రెడ్డి తెలిపారు.

సర్వే ఇలా జరుగుతుంది..

ఈ నెల 6 నుంచి సర్వే ప్రక్రియ ప్రారంభమై 18న ముగుస్తుంది. 19వ తేదీన సేకరించిన సమాచారాన్ని డేటా ఎంట్రీ చేస్తారు. ఈ నెలాఖరుకు పూర్తిస్థాయి డేటాను ఉన్నతాధికారులకు అందించాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయని జడ్సీ తెలిపారు. అన్ని సర్కిళ్లలో పదిమంది ఎన్యూమరేటర్లకు ఒక సూపర్‌వైజర్‌ను నియమించడం జరిగిందన్నారు. ప్రతి ఎన్యూమరేటర్‌కు 150 నుంచి 175 ఇళ్ల వివరాలు సేకరిం చాలని ఆదేశించారు. ఎన్యూమరేటర్ల బ్లాక్ మ్యాప్‌లను కూడా ఇప్పటికే తయారు చేయడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరు తమకు కేటాయించిన బ్లాక్‌లో రోజు 15-20 ఇళ్ల వివరాలు సేకరించేలా ఆదేశాలు జారీ చేశారు. ఎన్యూమరేటర్లు సక్రమంగా పనిచేసేలా సూపర్‌వైజర్లు వారితో సమన్వయం చేసుకుని సర్వేను పూర్తిచేస్తారని తెలిపారు. ముందుగా సూపర్‌వైజర్లు ఎన్యూమరేటర్లకు వారి వారి బ్లాక్‌లోని ప్రాంతాలను చూపిస్తారు. ఈ క్రమంలో వారు వారికి కేటాయించిన ఇళ్లకు స్టిక్కర్లు అంటిస్తారు. ఆ తర్వాత ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తారని తెలిపారు. ఎన్యూమరేటర్లు,సూపర్‌వైజర్లను ఎక్కువగా నియమిస్తున్నారు. ఎవరైన రాకపోతే ముందుగానే వారి స్థానంలో మరోకరిని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. అవసరానికి కంటే 10 శాతం అధికారికంగా సిబ్బందిని అందుబాటులో ఉంచనున్నట్లు జడ్సీ వివరించారు.

పకడ్బందీగా నిర్వహించాలి

చందానగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇంటింటి సర్వేను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని అందులో భాగంగా ఖచ్చితమైన సమాచారాన్ని మనం అందించాలని చందానగర్ ఉప కమిషనర్ మోహన్‌రెడ్డి అన్నారు. చందానగర్ అంబేడ్కర్ కల్యాణ మండపంలో ఎన్యూమరేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో అన్ని డివిజన్లలో 820 మంది ఎన్యూమరేటర్లు సర్వేలో పాల్గొంటారని తెలిపారు.

సర్కిళ్ల వారీగా వివరాలు

సర్కిల్	కుటుంబాలు	బ్లాక్‌లు	సూపర్ వైజర్లు	ఎన్యూమరేటర్లు
శేరిలింగంపల్లి	1,28,700	858	103	1030
చందానగర్	1,12,350	749	90	899
పటాన్‌చెరు	50,568	339	41	409
యూసుఫ్‌గూడ	86,293	690	83	828



జడ్సీని సత్కరిస్తున్న గుల్‌మెహర్‌పార్కు కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు

గుల్‌మొహర్‌పార్కు కాలనీలో సమస్యలు పరిష్కరించాలి

గచ్చిబౌలి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి డివిజన్ పరిధిలో గుల్‌మొహర్ పార్కు కాలనీలో సమస్యలు పరిష్కరించాలని కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు షేక్ కాసీం జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. కాలనీలోని చౌరస్తాలను అభివృద్ధి పరచాలని, పాత ముంబాయి రహదారిపై నల్లగండ్ల చౌరస్తా అభివృద్ధిచేసి ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలని, కాలనీలో సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని, చిల్డ్రన్స్ పార్కును అభివృద్ధి చేయాలని వినతి పత్రంలో వివరించారు. కార్యక్రమంలో మోహన్‌రావు, ప్రభాకర్ చారి, ఎండీ షకీల్, నర్సింహ పాల్గొన్నారు.

ప్రజావాణికి ఫిర్యాదులు

చందానగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): చందానగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. న్యూశంకర్‌నగర్ పార్కు స్థలానికి ప్రహరీ నిర్మించాలని అసోసియేషన్ సభ్యులు వినతిపత్రం అందజేశారు. మాదాపూర్ డివిజన్‌కు సంబంధించిన నాలుగు టౌన్‌ప్లానింగ్‌కు సంబంధించిన వినతలు అందాయి. కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఘరానా మోసగాడు కామేష్ అరెస్ట్



హైదరాబాద్ సిటీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఘరానా మోసగాడు మండా వెంకట కామేష్‌ను ఈస్ట్‌జోన్ ఉమెన్ పోలీస్‌స్టేషన్ పోలీసులు అరెస్ట్ చేశారు. కామేష్‌పై గుంటూరు, నగరంలో ఈస్ట్‌జోన్ ఉమెన్ పోలీస్‌స్టేషన్, చిలకలగూడ, మాదాపూర్, ఆబిడ్స్ పోలీస్‌స్టేషన్‌లలో కేసులున్నాయి. ఓ కేసు విచారణలో భాగంగా నిందితుడిపై నాంపల్లి కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. కానిస్టేబుల్ వి. రమేష్, నరేందర్, సురేష్‌రావు కామేష్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు.

లక్షదీపోత్సవానికి లక్ష్మీగణపతి ఆలయం ముస్తాబు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

చందానగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): చందానగర్ శిల్పాఎన్‌క్లేవ్‌లోని లక్ష్మీగణపతి దేవాలయం కార్తీక మాస లక్షదీపోత్సవ వేడుకలకు సిద్ధమైంది. ఈ నెల 6 నుంచి 15వ తేదీ వరకు జరిగే ఈ వేడుకలకు ఆలయాన్ని రంగురంగు విద్యుత్ దీపాలతో అలంకరించారు. 2017, ఏప్రిల్ 21న యూవీ రమణమూర్తి ఆలయ నిర్మాణం పూర్తి చేశారు. ఆలయ ప్రాంగణంలో సుబ్రమణ్య, ఆంజనేయ స్వామి, మల్లికార్జున భ్రమరాంబ ఆలయాలతో పాటు నవగ్రహ ఆలయాలు ఉన్నాయి. విశాఖశారద పీఠాధిపతి స్వరూపనందేంద్ర సరస్వతి స్వామి విగ్రహ మూర్తులను ప్రతిష్ఠించారు. నాటి నుంచి నేటి వరకు కోరిన భక్తుల కొంగుబంగారంగా స్వామివార్లు పూజలందుకుంటున్నారు.

మొదటి సోమవారం ప్రత్యేక పూజలు

కార్తీకమాసం మొదటి సోమవారం చందానగర్ సర్కిల్ పరిధిలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీగణపతి ఆలయం, వెంకటేశ్వరస్వామి ఆలయం, రామాలయం, పీజేఆర్ అయ్యప్ప ఆలయాల్లో పూజలు నిర్వహించారు. శివాలయాల్లో శివస్వామికి అభిషేక అర్చనలు చేసి పూజలుచేశారు.

ఆలయ కమిటీ సభ్యులు వీరే

శిల్పాఎన్‌క్లేవ్‌లో లక్ష్మీగణపతి ఆలయం నిర్మించాలనే సంకల్పం యూవీ రమణమూర్తికి కలిగింది. దాతల సాయంతో ఆలయ నిర్మాణం పూర్తిచేశారు. ఫౌండర్ చైర్మన్‌గా యూవీ రమణమూర్తి, సభ్యులు, చంద్రశేఖర్, చెన్నారెడ్డి, సుధాకర్, జైపాల్, కరుణాకర్‌గౌడ్, వెంకటేశ్వరరావు, దేవేందర్‌రెడ్డి ఉన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

ఆపదలో ఉన్న వారికి ఆపన్నహస్తం సీఎం సహాయనిధి

హైదర్‌నగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి ఆపదలో ఉన్నవారికి ఆపన్నహస్తంగా మారిందని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. కొండాపూర్ డివిజన్ ప్రేమ్‌నగర్ కాలనీకి చెందిన రూబీనా బేగం వైద్య చికిత్స కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకుంది. ఆమెకు మంజూరైన రూ.60 వేల చెక్కును ఎమ్మెల్యే గాంధీ సోమవారం తన కార్యాలయంలో ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి పేదల పక్షపాతి అని పేదలకు మంచి చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి



డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు, అధికారులు

హైదర్‌నగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని నిజాంపేట్ రోడ్డులో తలెత్తిన డ్రైనేజీ సమస్యను సీవరేజీ బోర్డు అధికారులతో, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి సోమవారం కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాంపేట్ రోడ్డులో డ్రైనేజీ సమస్యను ఉందని తెలిసినా పరిష్కరించడానికి బకెట్ క్లీనింగ్ చేపట్టాలని, మ్యాన్‌హోల్ నుంచి ప్రతి మ్యాన్‌హోల్ వరకు బకెట్ క్లీనింగ్ ద్వారా పేరుకుపోయిన వ్యర్థాలు, పూడిక తీయాలని, నీరు సాఫీగా వెళ్లేలా చూడాలని అధికారులను కోరారు. ఎక్కడయితే నిత్యం డ్రైనేజీ సమస్య తలెత్తుతుందో అలాంటి చోట శాశ్వత పరిష్కారం చూపడానికి అధికారులు కృషి చేయాలన్నారు.

ప్రజలు ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకువస్తే ప్రతి సమస్యను తప్పకుండా పరిష్కరిస్తామని, డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉంటామని తెలిపారు.

కార్యక్రమంలో డ్రైనేజీ సూపర్‌వైజర్ ఓం ప్రకాష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, నాయకులు నిరంజన్‌గౌడ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా అయ్యప్పస్వామి మహాపడిపూజ



మహాపడి పూజలో అయ్యప్ప భక్తులు

హైదర్‌నగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వివేకానందనగర్ డివిజన్ అయ్యప్పస్వామి ఆలయంలో మహాపడి పూజ ఆదివారం సాయంత్రం కనులపండువగా జరిగింది. వేదమంత్రోచ్ఛరణల మధ్య యోగేశ్వర తాంత్రి ఆధ్వర్యంలో హరిగురుస్వామి 18 కలశాల మహాపడిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సంధ్యంగా ఆలయ ప్రాంగణం అయ్యప్ప నామస్మరణలతో మార్మోగింది. అనంతరం 18 కలశాలతో 18 మెట్లకు పడిపూజ నిర్వహించారు. పూజల్లో పాల్గొన్న అయ్యప్పస్వామి మాలాధరణ భక్తులకు అన్నప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పాండుగురుస్వామి, రాహుల్‌స్వామి, క్రాంతి స్వామి, రాజుస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆ స్టంట్ వీడియోలు పాతవే

● వెల్లడించిన డీసీపీ వినీత్

హైదరాబాద్ సిటీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఐటీ కారిడార్‌లో బైక్ రేసింగ్, క్రాకర్లతో స్టంట్ చేస్తున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్ దర్యాప్తునకు ఆదేశించారు. అయితే పోలీసుల దర్యాప్తులో ఈ వీడియోలు ఏడాది క్రితం తీసినట్లుగా తేలింది. రామంతాపూర్‌కు చెందిన షమీర్ ఏడాది క్రితం ఐటీ కారిడార్ పరిధిలో బైకుకు క్రాకర్స్ పెట్టుకొని స్టంట్‌లు చేసిన వీడియోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు. ఈ వీడియోలను డౌన్‌లోడ్ చేసుకున్న షాబాజ్ అనే యువకుడు తన ఇన్‌స్టా ఐడీలో పోస్ట్ చేశాడు. దీపావళి సందర్భంగా క్రాకర్స్‌తో ప్రమాదకర స్టంట్‌లు చేశారంటూ సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ వీడియోల ఆధారంగా బైక్ స్టంట్‌లు చేసిన షమీర్‌పై కేసు నమోదు చేయడంతో పాటు, బైక్‌ను సీజ్ చేశామని డీసీపీ తెలిపారు. సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియోల గురించి విషయం తెలుసుకోకుండా ప్రచారం చేయడం ద్వారా ప్రజలు ఆందోళనకు గురవుతారని, సరైన సమాచారం తెలుసుకున్న తర్వాతే వీడియోలు పోస్ట్ చేయాలని ఆయన సూచించారు.

రేసింగ్‌లు నిర్వహించిన వారిపై కేసులు నమోదు చేస్తున్నామని.. ఈ ఏడాదిలో నవంబర్ 4 వరకు 203 బైకులు, 3 కార్లు సీజ్ చేసినట్లు తెలిపారు.

అంబేడ్కర్ వర్సిటీలో కొనసాగుతున్న నిరసనలు



నిరసన వ్యక్తం చేస్తున్న జేఏసీ నేతలు, ఉద్యోగులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే మూడో మెగా యూనివర్సిటీ డా.బీ.ఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ అని అంబేడ్కర్ జేఏసీ చైర్‌పర్సన్ ప్రొ.పల్లవీకాబ్డే, కన్వీనర్ ప్రొ.వడ్డాణం శ్రీనివాస్ అన్నారు. అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ పది ఎకరాల స్థలాన్ని జవహర్ లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి(జేఎన్‌ఏఎఫ్‌ఏయూ) కేటాయించొద్దని సోమవారం ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం తన ఆలోచనను వెంటనే ఉపసంహరించుకోవాలని.. లేదంటే తమ ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కంప్యూటర్ ఇంజనీర్ వసంతరావు మాట్లాడుతూ.. అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో డిగ్రీ నుంచి పరిశోధన కోర్సుల వరకు విద్యను అందిస్తున్నామన్నారు. దేశంలో స్థూల నమోదు నిష్పత్తిని పెంచడానికి ఈ విశ్వవిద్యాలయ దూర విద్యా విధానాన్ని ప్రోత్సహిస్తోందన్నారు.

కార్యక్రమంలో జేఏసీ నేతలు, అధ్యాపక, అధ్యాపకేతర, అడ్మినిస్ట్రేటివ్, టెక్నికల్ అసోసియేషన్, టైంస్కేల్, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నేతలు ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



కమిటీహాల్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

కమిటీహాల్ నిర్మాణానికి శంకుస్థాపన

హైదర్‌నగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని మహాత్మాగాంధీనగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న కమిటీ హాల్ నిర్మాణ పనులకు కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిటీ హాల్ నిర్మాణం నాణ్యత ప్రమాణాలతో గడువులోగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కాలనీలో చిన్నచిన్న ఫంక్షన్లు జరుపుకోవడానికి, సమావేశాలు నిర్వహించుకోడానికి కమిటీ హాల్ కాలనీ ప్రజలకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో పాండుగౌడ్, ప్రదీప్‌రెడ్డి, షౌకత్‌అలీ మునా, వెంకటేష్‌యాదవ్, ఇంద్రసేనరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పోశెట్టిగౌడ్, పద్మయ్య, గణేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఛట్ పూజలకు అనుమతులు

చందానగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఛట్ పూజలను బీహార్ రాష్ట్రానికి చెందిన వారు ఈనెల 6,7,8 తేదీల్లో నిర్వహించేందుకు జీహెచ్‌ఎంసీ అనుమతులు కవాలని వారు కోరారు. అందుకోసం అధికారులు కాయదమ్మకుంట, గుర్నాథం చెరువులోని కోనేరుల వద్ద నిర్వహించుకునేందుకు అనుమతులు ఇచ్చారు. ఈ మూడు రోజుల్లో సుమారు మూడువేల మంది బిహార్‌కు చెందిన వారు సూర్యనారాయణ మూర్తికి విశేష పూజలు నిర్వహించనున్నారు.

'టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి'

చందానగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గంలో టీడీపీ బలోపేతానికి కృషి చేయాలని, అందులో భాగంగా పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్‌గౌడ్ అన్నారు. హుడాకాలనీలోని పార్టీ కార్యాలయంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సోమవారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో చేపట్టాల్సిన పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్త అధికారులు.. కొత్త ఎస్టిమేషన్లు

● నచ్చినోళ్లకు పనులు కట్టబెట్టేందుకేనంటూ విమర్శలు
● అవినీతి కేంద్రాలుగా విద్యుత్ సర్కిల్ కార్యాలయాలు
● కొత్త కనెక్షన్ కావాలంటే చేతులు తడపాల్సిందే
● హబ్సిగూడ, మేడ్చల్, సంగారెడ్డి, సరూర్‌నగర్ సర్కిళ్లపై ఫిర్యాదులు



హైదరాబాద్ సిటీ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): అవినీతికి కేంద్రాలుగా విద్యుత్ సర్కిల్ కార్యాలయాలు మారుతున్నా దక్షిణ తెలంగాణ విద్యుత్‌పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) పట్టించుకోవడం లేదు. రెండు నెలల క్రితం వరకు క్షేత్రస్థాయిలో ఎవరిపై ఆరోపణలు వచ్చినా కఠిన చర్యలు తీసుకున్న డిస్కం ఉన్నతాధికారులు ఇంజనీర్ల బదిలీల తర్వాత అవినీతి ఆరోపణలు వస్తు న్నా పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. గ్రేటర్ పరిధిలో ఎస్‌ఈల మార్పు తర్వాత మేడ్చల్ సర్కిల్ పరిధిలో గతంలో వేసిన ఎస్టిమేషన్లను రద్దు చేసి కొత్తవి వేయడంపై విమర్శలు వస్తున్నాయి. ప్రధానంగా హబ్సిగూడ, మేడ్చల్, సంగారెడ్డి, సరూర్‌నగర్ సర్కిళ్ల పరిధిలో కొంతమంది డీఈ, ఏడీఈలపై అవినీతి ఆరోపణలు వస్తున్నా విచారణ చేపట్టడం లేదు. కొత్త విద్యుత్ కనెక్షన్లు తీసుకునేందుకు కస్టమర్ సర్వీస్ సెంటర్ల(సీఎస్సీ)లో దరఖాస్తులు చేస్తున్నా.. క్షేత్రస్థాయి అధికారులను నేరుగా కలిసి అడిగినంత ఇస్తే తప్ప ఫైళ్లు ముందుకు వెళ్లని పరిస్థితులు ఉన్నాయి. కొంతమంది ఎస్‌ఈలు తమకు నచ్చిన వాళ్లకు కాంట్రాక్ట్ పనులు అప్పగించేందుకు నిబంధనలను తమకు అనుకూలంగా మార్చుకుంటూ, ఉన్నతాధికారులకు తప్పుడు సమాచారం ఇస్తున్నారనే విమర్శలున్నాయి. సెక్షన్ స్థాయిలో కొంతమంది విద్యుత్ సిబ్బంది ప్రైవేట్ కాంట్రాక్టర్లుగా మారి స్థానిక అధికారుల అండతో ప్రైవేట్ పనులను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు.

బదిలీల్లో చక్రం తిప్పిన కొంతమంది అధికారులు

దక్షిణ డిస్కంలో మూడు వారాల క్రితం పెద్ద సంఖ్యలో ఇంజనీర్ల బదిలీలు జరిగాయి. ఆపరేషన్ విభాగంలో పనిచేసిన ఇంజనీర్లను తిరిగి ఆపరేషన్ విభాగానికి బదిలీ చేయబోమని నిబంధనలు పెట్టారు. అయినా కొంతమంది ఇంజనీర్లు మంత్రుల సిఫార్సులతోపాటు డబ్బు ఖర్చు చేసి నచ్చిన ప్రాంతాల్లో పోస్టింగులు తెచ్చుకున్నారు. బదిలీలపై ఇంజనీరింగ్ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. గైడ్‌లైన్స్‌కు విరుద్ధంగా బదిలీలు చేస్తారనే సమాచారం తెలిస్తే తాము కూడా మంత్రుల సిఫార్సు లేఖలు తెచ్చుకునేవారమని కొంతమంది ఇంజనీర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. బదిలీల ప్రక్రియ పూర్తయినా వారం రోజులు పాటు డిస్కం ప్రధానకార్యాలయం హెచ్‌ఆర్ విభాగం చుట్టూ ఇంజనీర్లు పెద్దసంఖ్యలో తిరిగారు. కొంతమంది ఇంజనీర్లు హెచ్‌ఆర్ విభాగం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేయడంతోపాటు సీఎండీని కలిసి జరిగిన పొరపాట్లను వివరించారు. హెచ్‌ఆర్ విభాగంలో కొంతమంది అధికారులు, సిబ్బంది అవినీతికి పాల్పడి గ్రేటర్‌జోన్‌లో కొంతమందికి పోస్టింగులు ఇప్పించారనే ప్రచారం జరిగింది. బదిలీల ప్రక్రియపై పూర్తిస్థాయిలో విచారణ జరిపితే అసలు విషయాలు తెలుస్తాయని కార్మిక సంఘాల నాయకులు చెబుతున్నారు. డబ్బులు ఖర్చు చేసి పోస్టింగులు తెచ్చుకున్న కొంతమంది ఇంజనీర్లు ఖర్చు చేసిన డబ్బు వసూలు చేసేందుకు అవినీతికి పాల్పడుతున్నారు. అక్రమాలకు పాల్పడుతున్న వారితో పాటు వారికి ఉన్నతస్థాయిలో అండగా నిలిచే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటే పరిస్థితుల్లో మార్పు వస్తుందని రిటైర్డ్ సీనియర్ ఇంజనీర్లు సూచిస్తున్నారు.

పశువులకు సోకే వ్యాధుల పట్ల యజమానులు అప్రమత్తంగా ఉండాలి

● పశువైద్య ఉపకేంద్రం జూనియర్ వెటర్నరీ అధికారి పి.ఎల్ ప్రసాద్



ఇంటర్వ్యూ...

గాజులరామారం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పశువులకు సోకుతున్న వ్యాధులు, తీసుకుంటున్న నివారణ చర్యలపై గాజులరామారం గ్రామం పశు వైద్య ఉపకేంద్రం జూనియర్ వెటర్నరీ అధికారి పి.ఎల్ ప్రసాద్ పశు వైద్యానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. పశువులతో పాటు పెంపుడు జంతువులకు సోకే వ్యాధుల పట్ల యజమానులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సరైన సమయంలో వైద్యాధికారిని సంప్రదించి జాగ్రత్తలు తీసుకోవాలని ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు ఆయన వెల్లడించారు.

● ఏయే జంతువులకు, పశువులకు వైద్యం చేస్తారు?

ఆవులు, గేదెలు, కోళ్లు, పిల్లులు, గొర్రెలు, మేకలు, కుక్కలకు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయి.

● ఈ సీజన్‌లో పశువులకు ఏ వ్యాధి సోకుతుంది?

ఈ సీజన్‌లో ఎక్కువగా గాలి కుట్టువ్యాధి సోకుతుంది. సరైన సమయంలో యజమాని గుర్తించి, వైద్యశాలకు తీసుకురావాలి. లేదంటే మందలో ఆ వ్యాధి సోకిన పశువు ఉంటే అన్నింటికీ సంక్రమిస్తుందన్నారు. దీనివల్ల శరీరంపై మచ్చలు ఏర్పడటం, మేత మేయకపోవడం జరిగి, మూతి నుంచి సొంగ కారుతుంది.

● పెంపుడు కుక్కలను పెంచే యజమానులు ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి?

పెంపుడు కుక్కలను వైద్యశాలకు తీసుకువస్తే యాంటీ ర్యాబిస్ ఇంజక్షన్ వేస్తాం. దీనివల్ల ఎవరినైనా కరిచినా అంత ప్రభావం ఉండదన్నారు. యజమానులు తప్పకుండా తమ కుక్కలకు యాంటీ ర్యాబిస్ ఇంజక్షన్ వేయించుకోవాలి.

● రోజూ ఎన్ని పశువులను వైద్యానికి తీసుకువస్తుంటారు?

రోజుకు 10 నుంచి 15 వరకు పశువులు, వివిధ రకాల జంతువులు వస్తుంటాయి. పశువులు నడవలేని స్థితిలో ఉంటే రైతుల కోరిక మేరకు మేమే వెళ్లి, ఇంటి దగ్గరే వైద్యం చేసి వస్తుంటామని చెప్పారు.

ఆకర్షించేలా అభివృద్ధి చేసి.. ప్రారంభం మరిచి..

ఆహ్లాదాన్ని పంచేందుకు చెరువును అభివృద్ధి పరిచి, చూపరులను ఆకట్టుకునే విధంగా వివిధ రకాల ఆకృతులతో బొమ్మలను ఏర్పాటు చేసి సుందరీకరించారు. చెరువు చుట్టూ వాకర్స్ నడిచేందుకు ట్రాక్‌ను కూడా నిర్మించారు. లక్షలు వెచ్చించి ఇవన్నీ చేసినా, ప్రస్తుతం అలీ చెరువు ప్రారంభానికి నోచుకోలేదని స్థానికులు అధికారులపై మండిపడుతున్నారు.



అభివృద్ధి పరిచిన అలీ చెరువు

దుండిగల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల డివిజన్‌లోని పేట్‌బషీరాబాద్ సర్వేనంబరు 31లో సుమారు 14.13 కుంటల స్థలంలో అలీ చెరువు ఉంది. ఇందులో 3.1 ఎకరాలను మేడ్చల్ రవాణా శాఖ కార్యాలయం ట్రాక్ పార్కింగ్ కోసం రెవెన్యూ అధికారులు స్థలాన్ని కేటాయించారు. 2.9 ఎకరాలను వైకుంఠ దామం కోసం పేట్‌బషీరాబాద్ గ్రామస్థులకు కేటాయించారు. మిగిలిన స్థలంలో అలీ చెరువు ఉంది. అయితే గతంలో వర్షం నీటితో పాటు పరిసర ప్రాంతాల మురుగు నీరు వచ్చి ఈ చెరువులో చేరుతుండేది. దీంతో గత ప్రభుత్వ హయాంలో ఈ చెరువు అభివృద్ధి కొరకు రూ. 60 లక్షలు అధికారులు వెచ్చించారు.

60 లక్షలతో అభివృద్ధి పనులు

కుత్బుల్లాపూర్ సర్కిల్ అధికారులు సుమారు రూ. 60 లక్షలతో చెరువు అభివృద్ధి పనులను చేపట్టి, ఇంజనీరింగ్, ఉద్యానవన శాఖాధికారులు చెరువును సుందరంగా తీర్చిదిద్దారు. గతంలో మాదిరిగా చెరువులోకి మురుగునీరు చేరకుండా చర్యలు తీసుకున్నారు. చెరువు చుట్టూ వాకర్స్ నడిచేందుకు వీలుగా కట్టను వెడల్పు చేసి, చెరువు మధ్యలో ప్లాంటెషన్‌ను ఏర్పాటు చేశారు. కుటుంబ సభ్యులతో సేద తీరేందుకు వచ్చే చిన్నపిల్లలకు ఆట వస్తువులు, వివిధ రకాల ఆకృతులతో బొమ్మలను ఏర్పాటు చేశారు. చెరువులోని ఒక పక్క ఇన్‌ప్లబ్లిని నిర్మించారు. మరో వైపు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టేలా బతుకమ్మ ఘాట్‌ను చెరువులో ఏర్పాటు చేశారు.

చెరువు ప్రారంభం ఎప్పుడు

చెరువును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది, దాదాపు సంవత్సరం గడుస్తున్నా అధికారులు ప్రారంభించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని, స్థానికంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో చుట్టుపక్కల ప్రజలు కుటుంబ సభ్యులతో కలిసి వాకింగ్‌కు వెళదాం అనుకుంటే అధికారులు ఇంకా చెరువును ప్రారంభించలేదని అధికారులపై మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ చెరువును ఉపయోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.



ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన జారుడు బండ



చెరువు మధ్యలో నిర్మించిన బ్రిడ్జి



పార్కులో ఏర్పాటు చేసిన ఏనుగుల బొమ్మలు



చెట్టు ఆకృతిలో ప్రధాన గేటు



పిల్లలు ఊగేందుకు ఏర్పాటు చేసిన ఉయ్యాలలు

నేటి సమావేశాన్ని విజయవంతం చేయండి

● కొలన్ హన్మంత్‌రెడ్డి



నిజాంపేట్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నేడు మధ్యాహ్నం బోయినపల్లిలోని గాంధీ ఐడియాలజీ సెంటర్‌లో కులగణనపై జరగనున్న సమావేశంలో ఏఐసీసీ అగ్ర నేత రాహుల్ గాంధీ, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్‌లు హాజరుకానున్నారని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో మేధావులు, పౌర హక్కుల నేతలు. విద్యార్థి కుల సంఘాల నేతలు హాజరై కుల గణనకు సంబంధించిన సలహాలు సూచనలు చేయాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, జిల్లా నాయకులు, బ్లాక్ అధ్యక్షులు, డివిజన్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు ఎస్సీ ఎస్టీ సెల్ నాయకులు, ఎన్ఎస్‌యూఐ నాయకులు, ఐఎన్‌టీ యూసీ నాయకులు, తమ ప్రాంతంలో ఉన్న కుల సంఘాల నాయకులను తీసుకురావాలని హన్మంత్‌రెడ్డి పిలుపునిచ్చారు.

గంధం మహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే

షాపూర్‌నగర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని హెచ్ఎంటీ మెయిన్ రోడ్డు దర్గాలో సయ్యద్ ఖాజాభాయ్ ఆధ్వర్యంలో జరిగిన గంధం మహోత్సవం కార్యక్రమంలో సోమవారం మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ పాల్గొన్నారు. ఆయన దర్గాను దర్శించుకొని ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ ఇబ్రహీం, ఖాజా, ఇబ్రహీం, ఇస్మాయిల్, మహ్మద్ ఖాజామియా, షాకీర్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న శ్రీశైలంగౌడ్

ఉమామహేశ్వరస్వామి దేవాలయంలో ఘనంగా కార్తీకమాస పూజలు

షాపూర్‌నగర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): శుద్ధ తదియ కార్తీకమాస మొదటి సోమవారాన్ని పురస్కరించుకొని సూరారం శివా హిల్స్‌లోని ఉమామహేశ్వరస్వామి దేవాలయంలో ఘనంగా పూజలు నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి దేవాలయానికి తరలివచ్చిన భక్తులతో కిక్కిరిసి పోయింది. 12 గంటల వరకు జరిగిన పూజల్లో అభిషేకాలు, అష్టోత్ర ఘటాభిషేకాలు నిర్వహించారు.

ఈ నెల 25న ఉమామహేశ్వరస్వామి కళ్యాణం నిర్వహిస్తామని, ఈ కార్యక్రమానికి హంపీ పీఠాధిపతులు పాల్గొంటారని ఆలయ ధర్మకర్త తెలియచేశారు. కార్తీకమాస పూజలు ముగింపు రోజున వేలాదిమంది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త ముద్దాపురం మదన్‌గౌడ్ తెలిపారు.



అభిషేకం నిర్వహిస్తున్న మదన్‌గౌడ్



శత ఘటాభిషేకంలో పాల్గొన్న భక్తులు



దేవాలయ ప్రాంగణంలో కిక్కిరిసిన భక్తులు

గాంధీ అంటే గౌరవమే.. తప్పయింది క్షమించండి

● క్షమాపణ కోరిన ఆకతాయిలు

బోయిన్‌పల్లి, నవంబర్ 4 (ఆంధ్రజ్యోతి): 'గాంధీ అంటే తమకు గౌరవం ఉంది. తెలియక చేశాం.. తప్పయింది క్షమించండి' అని బాపూజీ నగర్‌లోని గాంధీ విగ్రహం నోట్లో బాంబుపెట్టి పేల్చిన ఆకతాయిలు సోమవారం అదే విగ్రహం వద్ద వారి తల్లితండ్రులు స్థానికుల సమక్షంలో క్షమాపణ కోరారు. ఈ విషయంపై బోయిన్‌పల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోయిన్‌పల్లి బాపూజీనగర్‌లో నివాసం ఉండే ఓ యువకుడు (17)తో పాటు అతని స్నేహితులు మరో ముగ్గురు (16)లు శనివారం తమ బంధువులకు సంబంధించిన పెద్దకర్మ కార్యక్రమంలో మద్యం తాగి బస్తీలోని గాంధీ విగ్రహం వద్దకు చేరారు. ఈ క్రమంలో దీపావళి కావడంతో వారు బాంబులు తీసుకువచ్చి గాంధీజీ నోట్లో బాంబు పెట్టి పేల్చి వీరంగం సృష్టించారు. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ అయింది. దీంతో ఈ వీడియోను స్నాప్‌చార్ట్‌లో చూసిన స్థానికులు విషయాన్ని పోలీసులకు తెలిపారు. విచారణ చేపట్టిన బోయిన్‌పల్లి పోలీసులు నలుగురు ఆకతాయిలను అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో తల్లితండ్రుల విజ్ఞప్తి మేరకు సోమవారం అదే విగ్రహం వద్ద ఆకతాయిలు గాంధీజీ విగ్రహానికి పాలాభిషేకం చేసి శుద్ధిచేశారు. అనంతరం పూలమాలలు వేసి నివాళులర్పించి చెంపలు వేసుకుని పోలీసులను, స్థానికులను తల్లిదండ్రుల సమక్షంలో ప్రాధేయపడ్డారు. పోలీసులు ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా, వారి ఆదేశాల మేరకు మంగళవారం ఆకతాయిలను కోర్టులో హాజరుపరచనున్నారు.



గాంధీ విగ్రహానికి పూలమాలలువేసి క్షమించాలని వేడుకుంటున్న ఆకతాయిలు

సమస్యలను పరిష్కరించాలని ప్రజావాణిలో ఫిర్యాదు


గాజులరామారం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గాజులరామారం డివిజన్ ఎన్టీఆర్ నగర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి సోమవారం జరిగిన ప్రజావాణిలో గాజులరామారం డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కాలనీ నెలకొన్న పలు సమస్యలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయనకు వివరించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న సొంటిరెడ్డి పున్నారెడ్డి

రోడ్డు విస్తరణలో వదిలేసిన నిర్మాణాలనూ తొలగించాలి

దుండిగల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కొంపల్లి నుంచి బహదూర్‌పల్లి వెళ్లే రోడ్డును హెచ్ఎండీఏ ద్వారా రోడ్డు విస్తరణలో భాగంగా ఇరువైపులా ఉన్న పాత నిర్మాణాలను ఇంత వరకు తొలగించలేదని, వాటిని వెంటనే తొలగించాలని కాంగ్రెస్ నాయకుడు జెమ్మి దేవేందర్ సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజాదర్బార్‌లో జిల్లా అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఇదే విషయమై కొంపల్లి మున్సిపల్ అధికారులను పలు మార్లు కోరినా, కనీస సమాధానం లేదన్నారు. ఈ విషయమై పలు మార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా, పట్టించుకున్న దాఖలు లేవని జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. దూలపల్లి చౌరస్తా వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతూ ద్వి చక్ర వాహనదారులు గాయాలపాలవుతున్నారన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు పరిశీలించిన చర్యలు తీసుకోవాలన్నారు.



జిల్లా అధికారులకు వినతిపత్రం ఇస్తున్న జెమ్మి దేవేందర్

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : డిప్యూటీ మేయర్



డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్‌కు వినతిపత్రం ఇస్తున్న పలు అసోసియేషన్ల సభ్యులు

దుండిగల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్‌లోని శ్రీసాయి లక్ష్మి లే-అవుట్ ప్రజలు ఆల్విన్ మాజీ ఉద్యోగుల అసోసియేషన్ సభ్యులు, వీర్ భగత్ అసోసియేషన్ సభ్యులు సోమవారం వేరు సందర్భాల్లో డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్‌ను కార్యాలయంలో కలిసి తమ ప్రాంతంలో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని విన్నవించారు. అందుకు స్పందించిన ఆయన మీ సమస్యల పరిష్కారానికే మొదటి ప్రాధాన్యతను ఇస్తున్నామని, సంబంధిత అధికారులతో మాట్లాడి, ఇచ్చిన ఫిర్యాదులను పరిష్కరిస్తామని వారికి హామీ ఇచ్చారు.

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం

● కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ

దుండిగల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): దుండిగల్ మున్సిపాలిటీలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. శంభీపూర్‌లోని ఆయన కార్యాలయంలో మున్సిపాలిటీకి చెందిన పలు కాలనీల ప్రజలు తమ కాలనీలో మౌలిక సదుపాయాలకు కృషి చేయాలని కోరారు. అదేవిధంగా దుండిగల్ గ్రామంలో డబుల్‌బెడ్ రూమ్ నివాసితులకు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, మున్సిపాలిటీ నుంచి వారికి కనీస సౌకర్యాల కల్పనకు కృషి చెయ్యాలని కోరారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సౌకర్యాలు కల్పించేవిధంగా చూస్తానని వారికి హామీ ఇచ్చారు.



కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణకు వినతిపత్రం ఇస్తున్న కౌన్సిలర్ జక్కుల కృష్ణయాదవ్, గోపాల్‌రెడ్డి తదితరులు

● అభిషేకం



నిజాంపేట్‌లో అభయాంజనేయ స్వామి దేవాలయంలో మొదటి కార్తీక సోమవారం సందర్భంగా ఆలయం ప్రత్యేక పూజల్లో పాల్గొని శివలింగానికి అభిషేకం చేస్తున్న కొలన్ శ్రీనివాస్‌రెడ్డి.

- దుండిగల్ (ఆంధ్రజ్యోతి)

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

షాపూర్‌నగర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): షాపూర్‌నగర్ విద్యుత్ సబ్-స్టేషన్ పరిధిలో ఫీడర్ల మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్ ఉండదని ఏఈ కృష్ణ తెలిపారు. భగత్‌సింగ్ నగర్ 11కేవీ ఫీడర్ల మరమ్మతుల కారణంగా సాయిబాబానగర్ ఏరియాలో చెట్లు నరికే కార్యక్రమం ఉన్నందున ఈ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాలు సిద్ధం చేయాలి

హైదరాబాద్ సిటీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లతో పాటు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ దరఖాస్తులను, రెవెన్యూ అంశాల పరిష్కారానికి వేగవంతంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో హైదరాబాద్, సికింద్రాబాద్ రెవెన్యూ డివిజన్లకు చెందిన ఆర్డీఓలు, తహసీల్దార్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెండు పడకల ఇళ్లు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

సికింద్రాబాద్ పరిధిలోని జమునానగర్, తార్నాకలో అర్హులైన పేదలకు ఇళ్లు అందించే దిశగా పట్టాలను సిద్ధం చేసి అందుబాటులో ఉంచాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ముకుందరెడ్డి, డీఆర్‌ఓ వెంకటాచారి, ఆర్డీఓలు రామకృష్ణ, సాయిరామ్, తహసీల్దార్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

గాజులరామారం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి 8 సెల్ ఫోన్‌లు, రూ. 88 వేల 4 వందలు నగదు, 9మందిని అదుపులోకి తీసుకున్నారు. సూరారం ఎస్ఐ కృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం దేవేందర్‌నగర్‌లోని బతుకమ్మబండ లో కొంత మంది పేకాట ఆడుతున్నారని సమాచారం అందగా, ఆదివారం రాత్రి పోలీ సులు పేకాట స్థావరంపై దాడి చేసి వారిని అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేశారు.



● మర్యాద పూర్వక కలయిక

నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ మాజీ అధ్యక్షుడు ఆకుల సతీష్ సోమవారం రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు.

- నిజాంపేట్ (ఆంధ్రజ్యోతి)

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

దుండిగల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా, కోయిలకుంట గ్రామానికి చెందిన కాడమంచి రమేష్ (35)ఎల్ఈడీ బల్బుల వ్యాపారం చేస్తుంటాడు. గత సంవత్సరకాలంగా గండిమైసమ్మ చౌరస్తా ప్రాంతంలో కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. సోమవారం ఉదయం సారేగూడెం ప్రాంతంలోని జీపీఆర్ లే-అవుట్‌లో చెట్ల పొదల్లో రమేష్ మృతి చెంది ఉన్నాడు. ఇది గమనించిన స్థానికులు 100కు డయల్ చేసి సమాచారం అందించగా, దుండిగల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహం వద్ద లభించిన ఆధారాలను బట్టి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ నెల 3న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని, మృతుడు భార్య దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు మిస్సింగ్ కేసు కింద నమోదు చేశారు. మృతుడు చనిపోవడానికి గల కారణాలు తెలియలేదని, మద్యంమత్తులో కింద పడి చనిపోయాడా లేక మరేమైనా కారణాలు ఉన్నాయా? అనే కోణంలో విచారిస్తున్నారు. దుండిగల పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీకి తరలించారు.



మృతుడు రమేష్ (ఫైల్)

● ప్రారంభోత్సవం



నిజాంపేట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన రెస్టారెంట్‌ను పంచాయితీరాజ్‌శాఖ మంత్రి సీతక్క ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, రెస్టారెంట్ నిర్వాహకులు శ్రీనివాసరావు, సుస్మితా ఉన్నారు.

- నిజాంపేట్ (ఆంధ్రజ్యోతి)